RNI No - APTEL/2022/81596

janodaya

# జనోదయ

కరీంనగర్ బుధవారం 25.02.2026 సంపుటి : 03 సంచిక : 82 పేజీలు : 08 వెల : రూ.5

తెలుగు దినపత్రిక

Karimnagar Wednesday 25.02.2026 Volume: 03 Issue 82 Pages 08 Cost 5/

## కేరళ ఇక కేరళం

### రాష్ట్ర పేరు మార్పునకు కేంద్రం ఆమోదం



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24:** కేరళ ఇకపై కేరళం కానుంది. ఈ రాష్ట్రం పేరును మార్చడానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సుదీర్ఘ కాలంగా అపరిష్కృతంగా ఉన్న ఈ ప్రతిపాదనకు మంగళవారం ప్రధా ని మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఒక రాష్ట్రం పేరు మార్చాలంటే ఆ ప్రతిపాదన తీర్మానాన్ని శాసనసభ ఆమో దించాలి. రాష్ట్ర పేరు మార్పు బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపె ట్టేముం దు రాష్ట్రపతి సంబంధిత రాష్ట్ర శాసనసభ అభిప్రాయం తీసుకుంటా రు. తర్వాత బిల్లును పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రవేశపెడతారు. ఆ బిల్లు ఆమోదానికి సాధారణ మెజారిటీ సరిపోతుంది. అనంతరం రాష్ట్ర పతి ఆమోదంతో పేరు అధికారికంగా మారుతుంది. ఈ ఏడాది కేరళ లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ ఇది ప్రాధాన్యం సంత రించు కుంది. కేరళ పేరు మార్పుపై తొలిసారి 2023లో రాష్ట్ర అసెంబ్లీ తీర్మా నాన్ని ఆమోదించింది. ఇదిలా ఉండగా, మంగళవారం కేంద్ర మంత్రి వర్గ సమావేశం కొత్తగా నిర్మించిన ప్రధానమంత్రి కార్యాలయం 'సేవా తీర్థ్'లో జరిగింది. సేవాతీర్థ్‌లో క్యాబినెట్ భేటీ జరగడం ఇదే తొలి సారి.



## విప్లవ పోరాటానికి

# ముగింపు

తెలంగాణలో రూపుది ద్దుకున్న మావోయిస్టు విప్లవ పోరాటం ఇక్కడే ముగుస్తోందని రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న పునరావాస చర్యలను గమనించి మావోయిస్టులు లొంగిపో తున్నారని తెలిపారు. మంగళ వారం మావోయి స్టు పార్టీ కేంద్ర కమిటీ అప్రకటిత కార్యదర్శి తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ సహా నలు గురు అగ్రనేతలు పోలీసుల ఎదుట లొంగి పోయారు. హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో డీజీపీ సమక్షంలో దేవ్‌జీతోపాటు మావో యిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు నూనె నర్సిం హారెడ్డి అలియాస్ గంగన్న లొంగిపోయారు.

7లో..

**దేవ్‌జీ సహా నలుగురు అగ్రనేతల లొంగుబాటు**

**పార్టీలో తెలంగాణకు చెందినవారు ఇంకా 11 మంది వారు కూడా జనజీవన స్రవంతిలో కలవాలి: డీజీపీ**

**డీజీపీ సమక్షంలో లొంగిపోయిన తిప్పిరి తిరుపతి, మల్లా రాజిరెడ్డి, బడే చొక్కారావు, నూనె నర్సింహారెడ్డి**

**అనారోగ్యంతోనే రహస్య జీవితం వదిలాం.. ప్రజా సమస్యలపై ఇకపైనా పోరాటాలు చేస్తాం: దేవ్‌జీ**

**నేపాల్‌లో గణపతి.. అదుపులోకి తీసుకున్న పోలీసులు?**

## బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్

**దేశవ్యాప్తంగా అందించనున్న కేంద్రం**

**గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు చర్యలు**

**14 ఏళ్ల వయసున్న బాలికలకు సింగిల్ డోస్ గార్డాసిల్**




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24:** మహిళల్లో పెరుగుతున్న గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్‌కు అడ్డుకట్ట వేసే దిశగా కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నివారించే హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిలోమా వైరస్) వ్యాక్సిన్‌ను దేశవ్యాప్తంగా అందిం చేందుకు ఏర్పాట్లు చేస్తోంది. 14 ఏళ్ల వయసున్న బాలికలకు ఉచి తంగా హెచ్‌పీవీ టీకాను అందించే కార్యక్రమాన్ని త్వరలో ప్రారం భించనుందని ఆరోగ్యశాఖ వర్గాలు మంగళవారం తెలిపాయి. ఈ ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా సింగిల్ షాట్ గార్డాసిల్ హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను అందిస్తారు. ఇది గర్భాశయ క్యాన్సర్‌కు కారణమయ్యే హెచ్‌పీవీ వైరస్‌లోని నాలుగు రకాల (6, 11, 16, 10) ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ కల్పిస్తుంది. ఒక వ్యాక్సిన్ డోసు తీసుకోవడం వల్ల బాలికలకు సంబంధిత వైరస్‌ల నుంచి దీర్ఘకాలిక రక్షణ ఉంటుంది. జాతీయ కార్యక్రమంలో భాగంగా కేంద్రం ఈ వ్యాక్సిన్‌ను ఉచితం గా అందించనుంది. 15 ఏళ్లలోపు వయసున్న బాలికల కోసం ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న గార్డాసిల్-4 అనే వ్యాక్సిన్‌ను రెండు డోసులు అందించాల్సి ఉంటుంది. ఒక్కో డోసు ధర రూ.3,927. అయితే 15 ఏళ్లు పైబడిన బాలికలు మాత్రం మూడు డోసులు తీసుకోవాలి. గార్డాసిల్-4 వ్యాక్సిన్‌ను ఇండియా అనే సంస్థ తయా రు చేస్తోంది. ఈ టీకా 2006లో అందుబాటులోకి రాగా.. ప్రపం చవ్యాప్తంగా ఇప్పటి వరకు 50 కోట్ల డోసులను పంపిణీ చేశారు. దీంతో అనేక దేశాల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లు గణనీ యంగా తగ్గినట్టు అంచనా.

## అక్రిడేషన్ లేకుంటే అక్షరం ఆగుతుందా?




2లో..

## బ్రూక్ చిరస్మరణీయ శతకం

**పాకిస్థాన్‌ను చిత్తుచేసి సెమీస్‌కు ఇంగ్లండ్..!**

సూపర్ 8 తొలిపోరులో శ్రీలంకను చిత్తు చేసిన ఇంగ్లండ్ రెండో మ్యాచ్‌లో పాకిస్థాన్ పని పట్టింది. పల్లెకెలె స్టేడి యంలో హ్యారీ బ్రూక్(100) చిరస్మర ణీయ శతకంతో పాక్ బౌలర్లపై విరు చుకపడ్డాడు. ఛేదనలో 54కే నాలుగు వికెట్లు పడినా వెరవని బ్రూక్.. అటా కింగ్ గేమ్‌తో.. కీలక భాగస్వామ్యా లతో లక్ష్యాన్ని కరిగించాడు. విజయా నికి పది పరుగుల దూరంలో అతడు ఔటైనా విల్ జాక్స్(28) లాంఛనం పూ ర్తి చేశాడు. గ్రూప్ బీ నాకౌట్ దశలో రెండు వరుస విజయాలతో ఇంగ్లండ్ సెమీస్‌కు దూసుకెళ్లగా.. పాక్ ఆశలు ఆవిరయ్యాయి. మాజీ ఛాంపియన్




ఇంగ్లండ్ నాకౌట్ దశలో చెలరేగి ఆడు తోంది. ఆతిథ్య శ్రీలంకను 51 పరు గులు తేడాతో ఓడించిన.. హ్యారీ బ్రూ క్ సేన పాకిస్థాన్‌పైనా ప్రతాపం చూ పింది. 165 పరుగుల ఛేదనలో 54కే నాలుగు వికెట్లు పడినా.. బ్రూక్ క్రీజు నంటుకొని చిరస్మరణీయ శతకంతో మ్యాచ్‌ను ఇంగ్లండ్ వైపు తిప్పాడు. సామ్ కరన్(16), విల్ జాక్స్(28)తో కీలక భాగస్వామ్యాలు నెలకొల్పి.. మ్యా చ్‌ను పాక్ నుంచి లాగేసుకున్నాడు.

## 25మంది ఎమ్మెల్యేల రహస్య మంతనాలు

**బీఆర్ఎస్ మునిగిపోయిన నావ**

**కరీంనగర్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు దిమ్మదిరిగే షాక్**

**కేంద్రమంత్రి బండి సంజయ్**



7లో..

## దమ్ముంటే సాగునీటి ప్రాజెక్టులపై

# అసెంబ్లీలో చర్చకు రావాలి

- దేవాదుల ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం ఆగమాగం చేస్తుంది
- సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలి
- ఆసుపత్రి పనులు పూర్తి చేయకపోతే నిరాహారదీక్షకు దిగుతాం
- ఆసుపత్రి పనులను కావాలనే నత్తనడకన సాగిస్తున్నారు
- ఫ్యూచర్ సిటీ పై ఉన్న ధ్యాస.. ఆసుపత్రి పై లేదు
- ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీష్ రావు మండిపాటు

6లో..

ఇరిగేషన్ మీద అసెంబ్లీలో మాట్లాడ దామని ముఖ్యమంత్రి అంటున్నారు.. మేము మీ సవాల్‌ను స్వీకరిస్తున్నాం.. మైక్ కట్ చేయకుండా, కెమెరా తిప్ప కుండా చర్చకు పెట్టు.. ఎన్ని రోజులై నా, ఏ ప్రాజెక్టు మీదైనా చర్చించడానికి మేము సిద్ధంగా ఉన్నాం, ప్రజలే న్యాయ నిర్ణేతలు, ఎవరు ఏం చేశారో అసెంబ్లీ వేదికగా తేల్చుకుందాం అని మాజీ మంత్రి హరీష్ రావు సవాల్ విసిరారు.



# అక్రిడేషన్ లేకుంటే

# అక్షరం ఆగుతుందా?

●అక్రిడేషన్ల బెల్లానికి మరింత తీపి అద్దుతున్నదెవరు?

●రాయితీకార్డుని యూనివర్సిటీ పట్టాకన్నా అధికం చేసిందెవరు?

●పెద్ద మీడియాల వాస్తవ సర్క్యులేషన్‌లు ఎంత?

●ప్రకటనల రూపంలో ప్రజాధనాన్ని దోచేస్తున్నదెంత?

●అక్రిడేషన్ల గోలకి ప్రభుత్వమే ముగింపు పలకాలి?

.........................................

ప్రజలకు,ప్రభుత్వాలకు మధ్య వారధిగా ఉంటూ ప్రజాస్వామ్యానికి కావలిగా ఉండేదే జర్నలిజం.ఈ క్రమంలో వార్తల సేకరణలో ప్రయాణం కోసం క్షేత్రస్థాయిలో పర్యటించే విలేకర్ల కోసం బస్సుల్లో రాయితీల సౌకర్యాన్ని ప్రభుత్వాలు కల్పించాయి.ఇందుకోసం అక్రిడేషన్ అనే ఓ కార్డును ప్రవేశపెట్టాయి.ఈ కార్డు ఉన్న జర్నలిస్టులకు కొన్ని బస్సుల్లో ఉచితంగా ప్రయాణించ వచ్చు. ఉచితంగా ఎందుకంటే వార్తలను సేకరించే విలేకర్లకు యాజమాన్యంల నుంచి ఎలాంటి వేతనాలు ఉండవు కావున..వారికి స్వంతంగా డబ్బులు ఖర్చుచేసి క్షేత్రస్థాయిలో వార్తలను సేకరించడం ఇబ్బందిగా ఉంటుందనే ఉద్దేశ్యంతో ఉచిత ప్రయాణాన్ని ప్రభుత్వాలు కల్పించాయి.మొదట్లో కొన్ని బస్సుల్లో మాత్రమే ఈ ఉచితానికి అనుమతి ఉండేది..ఇప్పుడు దాదాపు అన్ని బస్సుల్లో ఈ ఉచిత ప్రయాణ కార్డుకు అనుమతి ఉంది.అయితే జర్నలిజానికి, అక్రిడేషన్‌కి ఏదైనా సంబంధం ఉందా? అక్రిడేషన్ ఉంటేనే జర్నలిస్టా? అక్రిడేషన్ లేకుంటే జర్నలిస్టు కాదా? అనే సందేహాలకు సమాధానం ఇవ్వాల్సిన ప్రభుత్వాతాలు దుదర్పష్టవశాత్తు తప్పుడు సమాచారాన్ని ఇస్తూ సమాజంలో జర్నలిజంపై సందేహాలు కల్గేలా చేస్తుండటం గమనార్హం.సమాచార శాఖ నిబంధనల ప్రకారం కొంత మందికి మాత్రమే అక్రిడేషన్ కార్డులు ఇస్తారు. ప్రింట్ కాపీలు,సర్క్యులేషన్,ఎడిషన్‌లు ఇలా అనేక నిబంధనల మేర నడిచే పత్రికలకు, మీడియాలకు ప్రభుత్వ ఎన్‌పానెల్‌మెంట్, అక్రిడేషన్లను జారీ చేస్తుంటాయి.ఈ జారీ క్రమంలో ప్రభుత్వ నిబంధనలు ఏంటి? అసలు ఏ మీడియాలకు అక్రిడేషన్లు ఇస్తున్నారు? ఏ పత్రికలకు కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని ప్రకటనల రూపంలో దోచిపెడుతున్నారు? అనే ప్రశ్నలకు ప్రభుత్వం దగ్గర,అధికారుల దగ్గర సరియైన జవాబే ఉండదు.వాస్తవానికి సమాచార శాఖ ప్రవేశపెట్టిన జీవోలు,నిబంధనల ప్రకారం రాష్ట్రంలో ఏ ఒక్క మీడియా,పత్రిక నడవడం లేదు.వాస్తవ సర్క్యులేషన్‌లు వేరు..చెప్పుకుంటున్న సర్క్యులేషన్‌లు వేరు.నిజానికి రాష్ట్రంలో ఉన్న ఏ ఒక్క మీడియా కూడా ప్రభుత్వం విధించిన నిబంధనల ప్రకారం నిర్వహణ లేదు.ప్రభుత్వానికి చూపించే సర్క్యులేషన్‌లు వేరు..ప్రింట్ చేసే కాపీలు వేరు.కేవలం వేలల్లో పత్రిక ప్రింట్‌లు చేస్తూ లక్షల్లో ప్రింట్ కాపీలు అమ్ముతున్నట్లుగా వివిధ మీడియాలు అగ్రశ్రేణి మీడియాలుగా ప్రభుత్వం నుంచి ప్రత్యేక జీవోలతో చెలామణి అవుతూ కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దోపిడీ చేస్తుండటం విస్మయం కల్గించే అంశమే. ఈ విషయం అటు ప్రభుత్వాలకు,అధికారులకు తెల్సినా..ఏ ప్రభుత్వ ఉన్నా..ఎవరు ముఖ్యమంత్రి ఉన్నా ఈ అతిపెద్ద కుంభకోణాన్ని కదిలించే సాహసం ఎవరూ చేయరు.ఎందుకంటే ఎవరు అధికారంలో ఉంటే ఆ భజన చేసే పార్టీ మీడియాలు,కార్పోరేట్ మీడియాలను పెంచిపోస్తున్నది ఈ రాజకీయపార్టీలే.అందుకే ఎవరు అధికారంలో ఉన్నా ఈ మీడియాల దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది.ఇక ఇప్పుడు ప్రభుత్వాలు ఇస్తున్న మీడియాల్లో ఎన్ని ప్రజల్లో ఉన్నాయి? ఎన్ని కాపీలను ప్రింట్ చేస్తున్నారు? అవి చెల్లిస్తున్న జీఎస్టీ ఎంత? కొంటున్న న్యూస్ ప్రింట్ ఎంత? కాల్చుతున్న విద్యుత్ బిల్లులు ఎంత? అసలు ఏ ప్రింటింగ్ ప్రెస్‌లో ఆయా పత్రికలు ప్రింట్ అవుతున్నాయి? సంబంధిత ప్రింటింగ్ ప్రెస్‌ల విద్యుత్ బిల్లులు ఎంత? కొంటున్న న్యూస్ ప్రింట్ ఎంత? ప్రభుత్వానికి చూపెడుతున్న ప్రింట్ కాపీల లెక్క ఎంత? ఇలా అనేక తేలికైన ప్రశ్నలకు జవాబు తేలిగ్గా దొరుకుతుంది. దీని కోసం పెద్దగా విచారణ చేయాల్సిన అవసరమే లేదు.అతిపెద్ద కుంభకోణం తేలిగ్గా బయటకు వస్తుంది.అయితే ఈ ముచ్చట జోలికే ప్రభుత్వాలు కానీ,అధికారులు కానీ పోరు.ఎందుకంటే పెద్ద మీడియాలతో గోక్కుంటే తమ కుర్చీలకు ఎక్కడ ఎసరు వస్తుందోననే భయం ఉంది.సరే.. ఇదంతా వదిలేద్దాం.ఎందుకంటే ప్రజలకోసం ఎంతోకొంత నిజాయితీగా మీడియాలు పనిచేస్తున్నాయి.ఈ క్రమంలో నిజాయితీగా,నిబంధనల ప్రకారం మీడియాలు నడవాలంటే కుదిరేపని కాదు.అందుకే చూసీచూడనట్లు ప్రభుత్వాలు ఉంటున్నాయి అనుకుందాం.ఇంతవరకు బాగానే ఉంది.అయితే వచ్చిన చిక్కల్లా ఒక్కటే..అక్రిడేషన్‌లు అనే ఉచిత బస్సు ప్రయాణ రాయితీ కార్డుని జర్నలిజం పట్టాగా చూపెట్టడమే.ఈ అక్రిడేషన్ అనే రాయితీ కార్డు కోసం అసలు నిజమైన జర్నలిస్టులు ఎందుకు వెంపర్లాతున్నారో..ఈ పరిస్థితిని ఎందుకు అటు ప్రభుత్వాలు ఇటు జర్నలిస్టు సంఘాలు కల్పిస్తున్నాయో అర్థం కాదు.మొత్తం జర్నలిజం అంతా ఈ ఉచిత బస్సు ప్రయాణ రాయితీ కార్డు చుట్టే తిరుగుతుండటం గమనార్హం.పెద్ద పెద్ద పేరుమోసిన జర్నలిస్టులు కూడా అక్రిడేషన్ లేకపోతే తమ ప్రాణాలు ఆగిపోతాయా ? అనే రీతిలో తహతహలాడుతుంటం విస్మయం కల్గించే అంశమే. అయితే క్షేత్రస్థాయిలో వార్తల సేకరణ కోసం జర్నలిస్టులకు ప్రయాణంలో రాయితీ ఉండాలనే ఉద్దేశ్యంతో కల్పించిన అక్రిడేషన్ రాయితీ కార్డుని అంతవరకే ఉంచితే ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదు.కానీ అది ఉంటేనే జర్నలిస్టు..ఆ కార్డు ఉంటేనే ఇంటి స్థలం..ఆ కార్డు ఉంటేనే వార్తల సేకరణకు అనుమతి అనే ఓ మూర్కత్వపు వాదాన్ని తెరమీదకు తేవడంతోనే ఈ చిక్కులన్నీ.అక్రిడేషన్ అనే భూతంతో మాట వినని పాత్రికేయులను తమ మాట వినేలా చేసుకోవడంతోపాటు అక్రిడేషన్ అనే బెల్లాన్ని ఉపయోగించి భజన మీడియాలను తమ గుప్పిట్లో ఉంచుకోవడానికి అటు పాలకులు, ఇటు కొన్ని జర్నలిస్టు సంఘాలు తెచ్చిన దౌర్భాగ్యమే అక్రిడేషనే సర్వం అనే వాదం. ఈ కార్డు ఉంటే చాలు అన్నీ ఉన్నట్లే అనుకునే ప్రచారం జోరందుకోవడంతో ఇక అక్రిడేషన్ అనే రాయితీ కార్డు యూనివర్సిటీ పట్టాకన్నా ఎక్కువయింది.అసలు జర్నలిజం అంటే ఎంటో..అక్రిడేషన్ అంటే ఏంటో తెలియని కొందరు అధికారులు..కొన్నివర్గాల ప్రజలకు అక్రిడేషన్ కార్డు ఉంటేనే జర్నలిస్టు అనే ముద్రని బలంగా వేయడంలో ఓ కుట్ర దాగి ఉంది.ఆ కార్డు ఉంటేనే జర్నలిస్టులని,లేకుంటే నకిలీలనే ప్రచారాన్ని ఓ పథకం ప్రకారం అటు ప్రభుత్వాలు,ఇటు కొన్ని జర్నలిస్టు సంఘాలు చేశాయి.దీంతో అక్రిడేషన్ కార్డు ఉంటే డబుల్ బెడ్ రూం ఇండ్లు,,అక్రిడేషన్ ఉంటే పిల్లలకు ప్రైవేటు బడుల్లో ఫీజుల రాయితీలు,అక్రిడేషన్ ఉంటే ప్రెస్‌క్లబ్బులో సభ్యత్వాలు,,గుర్తింపులు అనే ప్రచారంతో కొందరు నాన్ జర్నలిస్టులకు ఈ అక్రిడేషన్ కార్డు అంగట్లో కొనుక్కునే సరుకుగా మారింది.ఒక్కో కార్డుకు రూ.30 నుంచి 50 వేల దాకా వెచ్చించి అక్రిడేషన్ కొనుగోలు చేసి ఒక్కరోజులో అక్రిడేటెడ్ జర్నలిస్టుగా, సీనియర్ పాత్రికేయుడిగా మారిపోయినవారు లెక్కలేనంతమంది.అక్షరం ముక్కరాయలేనివారు, అసలు జర్నలిజంతో సంబంధంలేనివారి చేతిలో లెక్కలేనన్ని అక్రిడేషన్లు ఉన్నాయి.ఇప్పుడు వారంతా సీనియర్ జర్నలిస్టులు..వారికే ఇండ్ల జాగలు.ఈ కార్డు ఉపయోగించే రెండు మూడు ప్రాంతాల్లో ఇండ్ల జాగలు కొట్టేసిన పేరుమోసిన దళారీ పాత్రికేయులు ఎందరో..ఇలా చెప్పుకుంటూపోతే అనేక చీడలు,దౌర్భాగ్యవిధనాలు పాత్రికేయాన్ని పట్టిపీడిస్తున్నాయి.ఈ మురికిని వదిలించాల్సిన పాలకులు కొత్తకొత్త జీవోల పేరుతో మరింత మకిలీని అంటించే ఎత్తుగడలు వేస్తున్నారు.జర్నలిజానికి పట్టిన క్యాన్సర్‌కన్నా ప్రమాదకరం అక్రిడేషన్ల జాడ్యం.ఈ అక్రిడేషన్‌లు, ఎన్‌ప్యానెల్‌మెంట్ల బాగోతాన్ని కూకటివేళ్లతో పెకిలించాల్సిన మీడియా అకాడమీ పెద్దలు,కొన్ని పేరుగొప్ప జర్నలిస్టు సంఘాలు ప్రభుత్వానికి మరింత తప్పుడు సమాచారం ఇస్తూ తమ ప్రాభవాన్ని నిలుపుకునే ప్రయత్నం చేస్తుండటం గమనార్హం.అసలు అక్రిడేషన్‌కి జర్నలిజానికి సంబంధం ఏంటి? అది యూనివర్సిటీ పట్టాకాదు..అది కేవలం ఉచిత బస్సు ప్రయాణ రాయితీ కార్డు మాత్రమే అనే అవగాహన కల్పించాల్సిన కొన్ని జర్నలిస్టు సంఘాలు అక్రిడేషన్ కార్డు అనే బెల్లానికి మరింత తీపిని జోడించే యత్నం చేస్తుండగా మరికొన్ని జర్నలిస్టు సంఘాలు అసలు అక్రిడేషన్ కార్డులు లేకపోతే తమ ప్రాణమో పోతుందనే తరహాలో వినతి పత్రాలు ఇస్తూ తమ స్వంత ప్రచార డబ్బాకొట్టుకుంటూ సామాజిక మాధ్యమాల్లో గొప్ప జర్నలిస్టు సంఘాలుగా ప్రచారం చేసుకుంటున్నాయి. ఈ గందరగోళం నడుమ నిజమైన పాత్రికేయులు,మీడియాలు సైతం ప్రజల్లో మీకు అక్రిడేషన్ కార్డు లేదు కావున మీది మీడియాలు కాదు.. మీరు జర్నలిస్టులు కాదు అనే వివక్షతకు గురవుతున్నారు.30 సంవత్సరాలుగా జర్నలిజంలో ఉండి..వివిధ కారణాలతో అక్రిడేషన్లు లేని పాత్రికేయులు ఇప్పుడు ఈ దుర్మార్గపు ప్రచారాలతో జర్నలిస్టులుగా కాకుండా పోతున్న ఎత్తుగడలను అడ్డుకోవాల్సిందే.అసలు ఈ అబద్ధపు ప్రచారాలకు,అక్రిడేషన్ల గందరగోళానికి ప్రభుత్వమే ముగింపు పలకాలి.అసలు జర్నలిజానికి,అక్రిడేషన్‌నికి సంబందంలేదని.. ఆయా మీడియాలు ఇచ్చే ఐడీ కార్డులు,క్షేత్రస్థాయిలో ప్రజలకు,ప్రభుత్వాలకు మధ్య పనిచేసే వర్కింగ్ జర్నలిస్టులందరికీ అన్ని ప్రభుత్వరాయితీలు ఉంటాయని,చిన్న,పెద్ద అనే వివక్షత లేదని ప్రభుత్వమే స్వయంగా ప్రకటిస్తే అంగట్లో అక్రిడేషన్‌ల గోల ఉండదు.పబ్లిసిటీ యావ జర్నలిస్టు సంఘాల ఊకదంపుడు ప్రచారాలు ఉండవు. దీంతో నిజమైన పాత్రికేయులకు మేలు చేసినవారవుతారు.మరి ఆ దిశగా ప్రభుత్వం ఆలోచించాల్సిన తరుణం ఇదే.

....................







**మానసాని కృష్ణారెడ్డి**
**9618616110**

# పది పరీక్షలను సజావుగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**జనోదయ ,ఉమ్మడి ఆదిలాబాద్**

మంచిర్యాల జిల్లాలో జరుగనున్న 10వ తరగతి వార్షిక పరీక్షలను పకడ్బంధీగా నిర్వహించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.మంగళవారం మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.చంద్రయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య లతో కలిసి మండల విద్యాధికారులు, ముఖ్య పర్యవేక్షకులు, శాఖ అధికారులు, రూట్ అధికారులతో వార్షిక పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మార్చి 14 నుండి ఏప్రిల్ 16వ తేదీ వరకు 10వ తరగతి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, ఇందు కొరకు జిల్లాలో 48 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. 9 వేల 703 మంది రెగ్యులర్, 45 మంది ఒక్కసారి అనుత్తీర్ణులైన విద్యార్థులు పరీక్ష రాయనున్నారని, పరీక్షల నిర్వహణలో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను నియమించడం జరిగిందని తెలిపారు. పరీక్ష రోజున పోలీస్ స్టేషన్ నుండి పరీక్ష కేంద్రానికి ప్రశ్నాపత్రాలు తరలించడం జరుగుతుందని, పరీక్షా కేంద్రం గేటు బయట క్లాక్ రూమ్ ఏర్పాటు చేయాలని, ఎలాంటి తప్పులకు అవకాశం లేకుండా అధికారులు విధులు నిర్వహించాలని తెలిపారు. మాల్ ప్రాక్టీస్ సంబంధిత వార్తలు ప్రసారమైతే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. పరీక్ష నిర్వహణలో ఏమైనా ఇబ్బంది తలెత్తితే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని, పరీక్షా కేంద్రంలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. పరీక్ష కేంద్రాలకు కేటాయించిన ప్రకారంగా ప్రశ్నాపత్రాలు వెళ్లేలా అధికారులు పర్యవేక్షించాలని, పరీక్షా కేంద్రంలోనికి మొబైల్ ఫోన్లను అనుమతించకూడదని, అభ్యర్థులను లోనికి అనుమతించ సమయంలో పకడ్బందీగా తనిఖీ నిర్వహించాలని





తెలిపారు. పరీక్ష సమయం ముగిసే వరకు విద్యార్థులను బయటకు అనుమతించకూడదని సూచించారు. పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

# ప్రజలకు సకాలంలో సేవలు అందాలి

**సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ శ్రీజను కలిసిన శేరిలింగంపల్లి కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు సునీత ప్రభాకర్ రెడ్డి**



**జనోదయ, శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 24 :** శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు, మాజీ కౌన్సిలర్ సునీత ప్రభాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొండవీటి ప్రభాకర్ రెడ్డి సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ శ్రీజను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా శేరిలిం గంపల్లి పరిధిలోని పలు అభివృద్ధి అం శాలపై కమిషనర్‌తో చర్చించారు. ముఖ్యంగా కాల నీలలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, వీధి దీపాల సమస్యలు తది తర అంశాలను ఆమె దృష్టికి తీసుకువ చ్చారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న శేరిలింగంపల్లి ప్రాంతంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు అవసరమని సునీత ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. మాజీ కౌన్సిలర్‌గా ప్రజల సమస్యల ను సమీపంగా తెలుసుకున్నానని, వాటి పరిష్కారం కోసం సంబంధిత శాఖల సమన్వయం అవసరమని ఆమె అన్నారు. ప్రజలకు సకాలంలో సేవలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీ పనులను ప్రాధాన్యతగా చేపట్టాలని సూచించారు. కాంగ్రెస్ నాయకుడు ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ..పౌర సేవలు మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా అందాలంటే ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని అభిప్రాయపడ్డారు. నగరా భివృద్ధి కార్యక్రమాలలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించాల్సిన



అవసరం ఉందన్నారు. ఈ భేటీ స్నేహపూర్వక వాతావరణంలో జరిగింది. శేరిలింగంపల్లి అభివృద్ధి, ప్రజల సంక్షేమం దిశగా తగిన చర్యలు తీసుకుంటామని సైబరాబాదు మున్సిపల్ కమిషనర్ శ్రీజ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# పరీక్ష కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**




**జనోదయ, హనుమకొండ, ఫిబ్రవరి 24:** ఇంటర్మీడియట్ పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని వరంగల్ పోలీస్ క మిషనర్ తెలిపారు. జిల్లా పరిధిలో ని పరీక్ష కేంద్రాల వద్ద శాంతిభద్రతల రక్షణలో భాగంగా సెక్షన్ 163 బీ ఎన్, ఎస్, ఎస్ (144 సెక్షన్) అమలు చేయనున్నట్లు తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మొత్తం 94 పరీక్ష కేంద్రా ల్లో(హన్మకొండ 52, వరంగల్ 24, జనగామ 16) 25 ఫిబ్రవరి నుండి 18 మార్చి వరకు ఉదయం 09:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు పరీక్షలు నిర్వ హించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలుగా ఈ నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని సీపీ తెలి పారు.పరీక్ష కేంద్రాల పరిసరాల్లో ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమికూడరాదు.పరీక్ష కేంద్రాల నుండి 500 మీటర్ల పరిధిలోని అన్ని జిరాక్స్ కేంద్రాలు తేది 25 నుండి 18 వరకు ప్రతిరోజూ ఉదయం 06:00 గంటల నుండి మధ్యాహ్నం 02:00 గంటల వరకు మూసివేయాలని సీపీ ఆదేశించారు.ఎవరైనా ఈ ఉత్తర్వులను అతిక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడుతాయని సీపీ హెచ్చరించారు.

# పశుసంవర్ధక ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం

**-లింగ నిర్ధారణ వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేయించండి ఆడ దూడలు పొందండి**

**-కుమ్మరిగూడెం గ్రామ సర్పంచ్ శంకర్ నాయక్**

**-జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ నిర్వహణ అధికారి జి సంపత్ రావు**



**వరంగల్ జిల్లా ప్రతినిధి: (జనోదయ)** వర్ధన్నపేట మండలంలో రామోజీ కుమ్మరి గూడెం గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మరియు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా శిబిరాన్ని గ్రామ సర్పంచ్ భూక్య శంకర్ నాయక్, ఉప సర్పంచ్ భూక్య తిరుపతి ప్రారంభించారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ నిర్వహణ అధికారి జి సంపత్ రావు హాజరై రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ.. గోపాలమిత్ర సేవలను వినియోగించుకోవాలని, లింగనిర్ధారణ వీర్యం అందుబాటులో ఉందన్నారు. దీని ద్వారా ఆడ దూడలు మాత్రమే పుట్టుతాయాని దీనిని రైతు సోదరులు వినియోగించుకోవాలని తెలిపారు. శిబిరం ప్రారంభించిన అనంతరం ధమ్మన్నపేట పశువైద్య అధికారి డా మలోత్ రాజేందర్ నాయక్ శిబిరంకు వచ్చిన పాడి పశువులకు వైద్య పరీక్షలు నిర్వ హించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గోపాలమిత్ర సేవలను రైతులు వినియోగించుకోవాలని రైతులకు తెలిపారు. శిబిరంలో 66పశువులు రాగా 22 ఎదకు రాని 24 దూడలకు నట్టల నివారణ మందులు 6 గేదెలకు కృత్రిమ గర్భధారణ 11 గర్భకోశ వ్యాధులకు చికిత్సలు జరిపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది గద్దల ఐలయ్య, విజేందర్, గోపాలమిత్ర సూపర్వైజర్ ఏంపటి రాజేశ్వర్ రావు, గోపాలమిత్రులు మల్లెపాక సంపత్, మైదం రజిత, సుదగోని గోపాల్, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

**శంకరపల్లిలో**

# పిచ్చి మొక్కల తొలగింపు



**జనోదయ : మందమర్రి ఫిబ్రవరి 24:** మండలంలోని శంకరపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని రహదారి కిరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, చెట్ల పొదలు తొలగింపు పనులను గ్రామ సర్పంచ్ పెరుమాళ్ళ వెంకటేష్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని పల్లె ప్రకృతి వనం నుండి సండ్రోన్‌పల్లి గ్రామానికి వెళ్లే రహదారికిరువైపులా పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పిచ్చి మొక్కలు రోడ్డుపైకి వస్తుండడం దీనికి తోడు మూల మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల, వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పిచ్చి మొక్కల తొలగింపు కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. అంతే కాకుండా గ్రామంలోని వైకుంఠ ధామం ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించి చదును చేశారు.

# గొలుసుల సంతోష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



**వరంగల్ జిల్లా ప్రతినిధి: (జనోదయ)** హన్మకొండ సుబేదారి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 14వ డివిజన్ ఏనుమాముల ఇందిరమ్మ కాలనీ ఫేస్-1 (ముసలమ్మకుంట) గ్రామ పార్టీ అధ్యక్షుడు గొలుసుల సంతోష్ జన్మదినం సందర్భంగా వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు గొలుసుల సంతోష్‌ను శాలువాతో సత్కరించి, స్వీట్ తినిపించి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నర్సింగోజు నరేంద్రచారి, కుంభం శివపటేల్,తన్నీరు రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.



# ఎన్నో కుటుంబాలను బలిగొంటున్న ఫేక్ న్యూస్ ప్రచారాలు

## ఫేక్ న్యూస్ ప్రచారాలపై కఠిన శిక్షలు

### రూరల్ సీఐ వెంకటరమణ

**జనోదయ: డి. హీరేహాళ్ (రాయదుర్గం) ఫిబ్రవరి 24**

సోషల్ మీడియా ఇతర మాధ్యమాలలో అర్థరహిత సమాచారంతో ఫేక్ న్యూస్ ప్రచారాలు ప్రచారం చేయడం ద్వారా ఎన్నో పచ్చని కుటుంబాలను బలిగొంటున్నాయని ఇలా ఫేక్ న్యూస్ ప్రచారాలను కొనసాగించే వారిపై కఠిన శిక్షలు విధించడం జరుగుతుందని రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ తెలియజేశారు ఈ సందర్భంగా పత్రిక మూలంగా సిఐ వెంకటరమణ మాట్లాడుతూ ప్రతిరోజు ఫేస్బుక్ వాట్సప్ తదితర మాధ్యమాలలో ఎన్నో రకాలైనటువంటి సమాచారాలు ప్రచారం అవుతుంటా యని ఇందులో ఏవి వాస్తవం ఏది అవస్తవమో తెలుసుకోకుండా చాలా మంది వాటిని వెంటనే ఇతర మాధ్యమాలలోకి ఫార్వర్డ్ చేస్తూ ఉంటారని ఈ ఫేక్ ప్రచారాల ద్వారా సమాజంలో అనేక అనర్థాలు దారి తీస్తున్నాయని అన్నారు. ఇందుకు సంబంధించి ముఖ్యంగా మహిళలు, ఉద్యోగస్తులు వ్యాపారస్తులు, ఇతర వ్యక్తులపై సోషల్ మీడియాలో ఫేక్ ప్రచారాల ద్వారా బెదిరింపులకు పాల్పడుతూ వారి జీవితాలతో చాలా మంది ఫేక్ ప్రచారకర్తలు చెలగాటమాడుతున్నారని అలాంటి వారిని గుర్తించడం కోసం పోలీసు వ్యవస్థ కట్టుదిట్టమైన చర్యలు కూడా చేపట్టడం జరుగుతుందని తద్వారా వారిని కఠినంగా శిక్షించడం కూడా జరుగుతుందని అన్నారు.సోషల్ మీడియాలో వ్యాప్తి చెందుతున్న తప్పుడు పోస్టులు మిస్ ఇన్ఫర్మేషన్ను నిరోధించకపోతే అనేక సమస్యలు వస్తాయని అలా ఫేక్ న్యూస్ కట్టడికి ప్రభుత్వం కూడా ప్రత్యేక చట్టం తీసుకూవాలని నిర్ణయించిందని అన్నారు. ప్రభుత్వానికి అనుగుణంగానే సైబర్ క్రైమ్ ఇతర విభాగాలు నిరంతరం సోషల్ మీడియా పై నిఘాను కట్టుదిట్టంగా అమలు పరచడం జరు గుతుందని ఈ సందర్భంగా అన్నారు.



## నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి సాధించాలి

### సింగరేణి డైరెక్టర్ పిపి వెంకటేశ్వర్లు




**జనోదయ : మందమర్రి ఫిబ్రవరి 24**

ప్రస్తుత పోటీ మార్కెట్లో బొగ్గు వినియోగదారుల అవసరాల కనుగుణంగా సింగరేణి సంస్థ నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి సాధించాల్సిన అవసరం ఉందని సంస్థ డైరెక్టర్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ కె వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి-రాబోయే సవాళ్లను ఏ విధంగా అధిగమించాలనే అంశంపై మంగళవారం ఏరియాలోని ఇల్లందు క్లబ్లో మార్కెటింగ్ క్వాలిటీ ఉన్నతాధికారులు మందమర్రి, బెల్లంపల్లి ఏరియాల అధికారులకు నిర్వహించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్లో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా బొగ్గు నాణ్యత ఉత్పత్తిపై సంబంధిత అధికారులకు పలు సూచనలు సలహాలు అందచేశారు. అనంతరం జిఎం క్వాలిటీ కార్పొరేట్ ఏ.రవికుమార్ మాట్లాడుతూ అధికారుల నుంచి క్షేత్రస్థాయిలో పని చేసే ఉద్యోగికి బొగ్గు నాణ్యతపై అవగాహన అవసరమని తెలిపారు.ఈ సమావేశంలో జిఎం కోఆర్డినేషన్ అండ్ మార్కెటింగ్ కార్పొరేట్, హైదరాబాద్ టి శ్రీనివాస్,ఏరియా జనరల్ మేనేజర్ ఎన్ రాధాకృష్ణ, బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ కె విజయభాస్కర్ రెడ్డి,బెల్లంపల్లి రీజియన్ క్వాలిటీ జిఎం, పి.వీరభద్రరావు, రీజినల్ క్వాలిటీ జనరల్ మేనేజర్ రామగుండం రీజియన్, సుజోయ్, ముజేందర్లు పాల్గొన్నారు.

# గ్రామస్థాయి పరిపాలనలో జిపిఓల పాత్ర కీలకం

### జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య



**జనోదయ, ఉమ్మడి ఆదిలాబాద్ :**

ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తూ గ్రామస్థాయి పరిపాలనలో జిపిఓల పాత్ర కీలకమైనదని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య అన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భావన సమావేశ మందిరంలో జిపిఓ/ఆర్ ఐ యాప్ పై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి తహసిల్దార్ మల్లికార్జున్, ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ సునీల్లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గతంలో వి.ఆర్.ఓ., వి.ఆర్.ఏ. లుగా సేవలు అందించిన వారు గ్రామంలో జరిగే అన్ని విషయాలను ప్రభుత్వానికి అందించి ప్రజా సంక్షేమం కోసం చర్యలు తీసుకునేందుకు గ్రామ పాలన అధికారులుగా నియమించడం జరిగిందని తెలి పారు. గ్రామస్థాయిలో ధ్రువపత్రాల జారీ, లబ్ధిదారుల ఎంపిక జి పి ఓ ల ద్వారా చేయడం జరుగుతుందని తెలి పారు. కులం, ఆదాయం ఇతర ధ్రువ పత్రాల కొరకు మీ సేవా ద్వారా అందిన దరఖాస్తులను యాప్ ద్వారా పరిశీలించి పరిష్కరించవచ్చని, తద్వారా సమయం ఆదావుతుందని, పారదర్శకంగా ఉంటుందని తెలిపారు. భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకువచ్చి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో ప్రజలకు సేవ చేయడమే ధ్యేయంగా అధికారులు పనిచేయాలని తెలిపారు. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని, గత అనుభవం దృష్ట్యా రికార్డులపై గ్రామ పాలన అధికారులు అవగాహన కలిగి ఉన్నారని, ఈ మేరకు సమస్యల పరిష్కారం వేగవంతం అవుతుందని, పారదర్శకంగా విధులు నిర్వహించాలని తెలిపారు. గ్రామస్థాయిలో సర్వేయర్కు సహాయకులుగా వెళ్లవలసి ఉంటుందని, తద్వారా గ్రామ సంబంధిత భూములపై అవగాహన పొందుతుందని, గ్రామ పాలన అధికారులు తమ విధులు, అధికారాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. విరాసత్, ముటేషన్ల విషయంలో మోకా మీద విచారణ జరపాలని సూచించారు. విధుల విషయంలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి అధికారులకు పే అప్ గ్రేడేషన్ వర్తింపచేయాలి



**జనోదయ, మందమర్రి ఫిబ్రవరి 24:**

సింగరేణి కంపెనీలో పని చేస్తున్న అధికారులకు కోల్ ఇండియా మాదిరిగా పే అప్ గ్రేడేషన్ వర్తింప జేయాలని సిఎంఓఏఐ ఏరియా అధ్యక్షుడు ఎస్ రమేష్ కోరారు.మంగళవారం ఏరియా జిఎం కార్యాలయం లో సిఎంఓఏఐ ఆధ్వర్యంలో పలు డిమాండ్లపై ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ, పే అప్ గ్రేడేషన్ వర్తింప చేయడంతో పాటు 2022 – 23, 2023 -24 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన పిఆర్పి ని వెంటనే అధికారులకు చెల్లించాలన్నారు. అదేవిధంగా ఉచిత విద్యుత్తు, అధికారుల పిల్లలకు ఐఐటి, ఐఐఎం ఫీజు రియంబర్స్మెంట్, పదోన్నతుల్లో పారదర్శకత వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ఏరియా ఉపాధ్యక్షుడు ఎన్ వర్ధన్, జాయింట్ కార్యదర్శి రవి, కోశాధికారి సరిత, ఏరియా ఎస్ఓటు జిఎం జివిఎల్ ప్రసాద్, కేకే ఓసిపి ప్రాజెక్ట్ అధికారి మల్లయ్య, ఐఈడి ఎస్ఈ కిరణ్ కుమార్, ఏరియా ఇంజనీర్ బాలాజీ భగవతి జా పాల్గొన్నారు.

# కార్మిక మంత్రిని విమర్శించడం సిగ్గుచేటు

### కాంగ్రెస్ నాయకులు

**జనోదయ : మందమర్రి ఫిబ్రవరి 24:**

క్యాతనపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ ఎంపిక విషయంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి జి వివేక్ వెంకటస్వామి పై చేస్తున్న ఆరోపణలను పట్టణ కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. పట్టణంలోని ఎమ్మెల్యే మినీ క్యాంప్ కార్యాలయంలో మంగళ వారం ఏర్పా టు చేసిన విలేకరుల సమావేశంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నోముల ఉపేందర్ గౌడ్, ఉమ్మడి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి సొత్కు సుదర్శన్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పుల్లూరి లక్ష్మణ్, జిల్లా నాయకులు పైడిమల్ల నర్సింగ్ లు మాట్లాడారు.మున్సిపల్లో కాంగ్రెస్ పార్టీకి 7 గురు కౌన్సిలర్లు ఉన్నారని, బిఆర్ఎస్ సిపిఐ కూటమికి14 మంది కౌన్సిలర్లు ఉన్నారని,అయినప్పటికీ చైర్ పర్సన్ ఎన్నిక విదేశంలో భయం ఎందుకు అని వారు ప్రశ్నించారు. బిఆర్ఎస్ సిపిఐ కూటమిలో ఉన్న 14 మంది కౌన్సిలర్లలో ఇద్దరిని బాల్క సుమన్ బలవంతంగా బెదిరించి, వారిని ఒక చోట నిర్బంధించి, కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయకూడదని ఒత్తిడి తెచ్చినట్లు వారు ఆరోపించారు. చైర్ పర్సన్ ఎన్నిక సందర్భంగా బెదిరింపులకు గురైన సభ్యులు ఎన్నిక సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి చేతులు ఎత్తి ఓటు వేస్తారో, మున్సిపల్ చైర్మన్ పదవి జారి పోతుందనే భయంతోనే కావాలనే క్యాతనపల్లి ఫ్లైఓవర్ వద్ద మంత్రి వాహనంపై, పోలీసుల వాహనాలపై, పోలీసులపై, అలాగే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై రాళ్ల దాడికి పాల్పడ్డారని వారు విరుచుకు పడ్డారు. బి ఆర్ ఎస్ నాయకులకు భయం లేకపోతే, చైర్మన్ పదవి మీకే వస్తుందని నమ్మకం ఉంటే, ఇలాంటి దాడులు చేయాల్సిన అవసరం ఎందుకు అని వారు ప్రశ్నించారు.ఇది



ప్రజాస్వామ్యానికి విరుద్ధమైన చర్య అని వారు మండి పడ్డారు. దాడుల సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తలు శాంతి యుతంగావ్యవహరించారని , అనవసర ఆరోపణలు, దాడులు చేస్తే ప్రజలే తగిన బుద్ధి చెప్తారని వారు స్పష్టం చేశారు.

# కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందనే అక్కసుతోనే నిర్లక్ష్యం

**జనోదయ : వరంగల్ ప్రతినిధి**

వరంగల్‌లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులను మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు, ఇతర బీఆర్ఎస్ నేతలతో కలిసి పరిశీలించారు. ఆసుపత్రి పనుల పురోగతిని పరిశీలించిన అనంతరం హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ హయాంలోనే 24 అంతస్తుల స్లాబులు పూర్తయిన ఈ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని చూస్తుంటే బాధేస్తోందని హరీష్ రావు అన్నారు. 2024 దసరాకే ఇది ప్రారంభం కావాల్సింది. కేసీఆర్ ఉండి ఉంటే ఈ పాటికి ప్రజలకు అందుబాటులోకి వచ్చేది. కానీ కాంగ్రెస్ వచ్చాక పనులు అటకెక్కి, రెండు దసరాలు పోయి మూడో దసరా వస్తున్నా కదలడం లేదు. రేవంత్ రెడ్డికి ఫ్యూచర్ సిటీ, రియల్ ఎస్టేట్ వ్యాపారం, కాంట్రాక్టర్ల మీద ఉన్న శ్రద్ధ. కేసీఆర్ కట్టిన ఈ హెల్త్ సిటీ మీద లేదు. ఫ్యూచర్ సిటీకి పెట్టిన శ్రద్ధలో 10 శాతం పెట్టినా ఈ పనులు ఎప్పుడో పూర్తయ్యేవి. రోగుల బంధువుల కోసం కేసీఆర్ ధర్మశాల నిర్మించాలని నిర్ణయిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని సగానికి సగం తగ్గించింది. రోడ్ నెట్‌వర్క్, ఎలివేషన్ వర్క్స్ అన్నీ తగ్గించేశారు. కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందనే అక్కసుతోనే ఈ నిర్లక్ష్యం. ఈ హెల్త్ సిటీకి ఎన్ని నిధులు కావాలో బీఆర్ఎస్ ప్రభుత్వమే సమకూర్చి పెట్టింది.

### ఓపీ చూడ్డానికి ఈ హాస్పిటల్ ఎందుకు..?

కానీ మీరు డిజైన్ల మార్పు పేరుతో నిర్ణయాలు తీసుకోకపోవడం వల్లే ఆసుపత్రి ప్రారంభానికి నోచుకోవడం లేదు. జూన్ 2న ఆసుపత్రిని ప్రారంభిస్తామని చెప్తున్నారు. 2000 పడకల ఈ ఆసుపత్రికి 2000 మంది నర్సులు, 1500 మంది డాక్టర్లు, 1000 మంది పారామెడికల్ సిబ్బంది కావాలి. ఇంతవరకు రిక్రూట్‌మెంట్‌కు క్యాబినెట్ ఆమోదం తెలిపిందా..? నోటిఫికేషన్ ఇచ్చారా..? కనీసం సిబ్బంది లేకుండా హాస్పిటల్ ఎలా ప్రారంభిస్తారు..? పేపర్లలో చూస్తే 'ఓపీ సేవలు' ప్రారంభిస్తాం అని రాశారు. ఇది సూపర్ స్పెషాలిటీ హాస్పిటలా..? లేక బస్తీ దవాఖానానా..? ఓపీ చూడ్డానికి ఈ హాస్పిటల్ ఎందుకు..? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో వరంగల్ గల్లీగల్లీలో బస్తీ దవాఖానాలు పెట్టాం. దీన్ని కూడా మరో బస్తీ దవాఖానా చేయకండి. వెంటనే ఎక్విప్మెంట్, సిబ్బంది నియామకం పూర్తి చేసి పూర్తిస్థాయిలో ఆసుపత్రిని ప్రారంభించాలి. లేదంటే బీఆర్ఎస్ పక్షాన ఇక్కడే నిరాహార దీక్షకు దిగుతాం. ఉత్తర తెలంగాణకు సంజీవని లాంటి వరంగల్‌లో ఆరోగ్య శాఖ పరిస్థితి దయనీయంగా మారిందని హరీష్ రావు అన్నారు. వరంగల్ మంత్రులకు, ఎమ్మెల్యేలకు అసలు సోయి ఉందా.. ? ఎంజీఎం పరిస్థితి చూస్తే వార్తలు రాసి రాసి పత్రికా విలేకరులే విసిగిపోయారు. రేవంత్ రెడ్డి ఎన్నోసార్లు వరంగల్ వచ్చినా ఒక్కసారైనా ఎంజీఎంను చూశారా..? అని హరీష్‌రావు ప్రశ్నించారు. రెండున్నరేళ్లలో ఆరోగ్య మంత్రి అటువైపు వెళ్లారా..? ఎంజీఎం ఇప్పుడు ఎలుకలు, పందికొక్కులకు నివాసంగా మారింది. వీల్ చైర్లు, స్ట్రెచర్లు, మంచాలు లేవు. టెస్టులకు మెటీరియల్ లేదు. బీఆర్ఎస్ హయాంలో ఎంజీఎంలో 250 గుండె ఆపరేషన్లు ఉచితంగా చేశాం. కానీ ఇప్పుడు ఆపరేషన్ థియేటర్లలో ఏసీలో నీళ్లు కారుతున్నాయని థియేటర్లనే మూసేశారు. రోగులను హైదరాబాద్ కు పంపిస్తున్నారు. మేము కేథలాబ్ లు, మూడు ఆక్సిజన్ ప్లాంట్లు ఏర్పాటు చేసి మీ చేతిలో పెడితే, వాటిని నడిపించే సత్తా కూడా మీకు లేదన్నారు. ఎక్స్‌రే మిషన్లు పనిచేయవు. ఆయుష్ ఆసుపత్రిలో మందులు లేవు. ఎంజీఎంను తక్షణమే సమీక్షించి, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో హరీష్ రావు వెంట మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, రవీందర్ రావు, మాజీ ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, వినయ్ భాస్కర్, పెద్ది సుదర్శన్ రెడ్డి, అరూరి రమేష్, నన్నపునేని నరేందర్, శంకర్ నాయక్, సీనియర్ నాయకులు నాగుర్ల వెంకన్న, మర్రి యాదవ రెడ్డి, డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.





**రేవంత్ రెడ్డి ఒక్కసారైనా ఎంజీఎంను చూశారా..?**
**బీఆర్ఎస్ హయాంలోనే 24 అంతస్తుల స్లాబులు పూర్తి**
**2024 దసరాకే ప్రారంభం కావాల్సింది**
**కేసీఆర్ ఉండి ఉంటే ఈ పాటికి ప్రజలకు అందుబాటులోకి**
**జూన్ 2న ఆసుపత్రిని ప్రారంభిస్తామని చెప్తున్నారు**
**కావాల్సిన సిబ్బంది రిక్రూట్‌మెంట్‌కు క్యాబినెట్ ఆమోదం తెలిపిందా..?**
**కనీసం సిబ్బంది లేకుండా హాస్పిటల్ ఎలా ప్రారంభిస్తారు..?**
**పేపర్లలో చూస్తే 'ఓపీ సేవలు' ప్రారంభిస్తాం అని రాశారు**
**ఇది సూపర్ స్పెషాలిటీ హాస్పిటలా..? లేక బస్తీ దవాఖానానా..?**
**ఓపీ చూడ్డానికి ఈ హాస్పిటల్ ఎందుకు..?**

**మాజీమంత్రి హరీష్ రావు ధ్వజం**

# అందరి చూపు ఆదర్శ పాఠశాలల వైపే

- ఫలితాల్లో ఆదర్శం
- యేటా పెరుగుతున్న పోటీ
- ఈ నెల 28 వరకు ఆన్ లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- జిల్లా వ్యాప్తంగా ఐదు పాఠశాలలు
- ఏప్రిల్ 19న ప్రవేశ పరీక్ష

**జనోదయ, మందమర్రి ఫిబ్రవరి 24:**

విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో ఉచిత నాణ్యమైన ఉన్నత విద్యను అందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదల కావడంతో ప్రవేశాల కోసం జిల్లా వ్యాప్తంగా తీవ్ర పోటీ నెలకొంది. జిల్లాలోని మందమర్రి, కాసిపేట, మంచిర్యాల, కోటపల్లి దండేపల్లి మండలం లోని లింగాపూర్ లో ఉన్న పాఠశాలల్లో ఆరవ తరగతిలో 500 సీట్లు, 7,8,9,10 వ తరగతుల్లో పరిమిత సీట్లు ఖాళీలు ఉండగా వాటి భర్తీ కోసం ప్రవేశ పరీక్ష నిర్వహించి అందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభ ఆధారంగా, వారి రిజర్వేషన్ అనుసరించి సీట్లను కేటాయించడం జరుగుతుంది. జిల్లా వ్యాప్తంగా ఉచిత ఇంగ్లీష్ మీడియం విద్యను, అందులో నాణ్యమైన విద్యను అందిస్తున్న ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాల కోసం ప్రతి విద్యా సంవత్సరం వేల సంఖ్యలో దరఖాస్తులు వస్తుండగా విద్యార్థుల ప్రతిభ ఆధారంగా సీట్లు దక్కుతుండడంతో ప్రతి సంవత్సరం సీట్ల కోసం తీవ్ర పోటీ నెలకుంటుంది. ఆంగ్ల మాధ్యమంలో ఆధునిక వసతులతో సృజనాత్మక పెంపొందించేలా పాఠ్యాంశాల బోధన జరుగుతుండడంతో సగజంగానే విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలను ఆదర్శ పాఠశాలల్లో చేర్పించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. అదిగాక ఆరవ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు ఉచిత ఆంగ్ల మాధ్యమంలో నాణ్యమైన విద్యాబోధన అందిస్తుండటంతో తమ పిల్లలను ఆదర్శ పాఠశాలల్లో చేర్పించేందుకు ఉత్సాహం కనబరుస్తున్నారు.

### ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా...

జిల్లాలోని ఆదర్శ పాఠశాలల్లో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యాబోధన జరుపుతుండగా అంతే దీటుగా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. దీంతో పాఠశాలల్లో ప్రవేశాలకు తీవ్ర పోటీ నెలకొంటుంది. ప్రతి సం,, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా 10 జిపిఏ పాయింట్లు సాధిస్తున్న విద్యార్థులు అధిక సంఖ్యలో ఉండటంతో ఎలాగైన తమ పిల్లలను ఆదర్శ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులు భావిస్తుండడంతో ప్రవేశాల కోసం తీవ్ర పోటీ నెలకొంటుంది. ప్రైవేట్ పాఠశాలల్లో వేలాది రూపాయలు ఫీజులు చెల్లించలేని నిరుపేద కుటుంబాల విద్యార్థులకు ఆదర్శ పాఠశాలలు వరంగా మారడంతో అందులో తమ పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఉత్సాహం చూపుతుండగా దాని ఫలితంగానే ప్రతి సంవత్సరం ప్రవేశాల కోసం తీవ్ర పోటీ నెలకొంటుంది.

### ప్రవేశ పరీక్ష ఇలా...

ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న ప్రవేశ పరీక్ష వంద మార్కులకు ఉండగా విద్యార్థులు తాము దరఖాస్తు చేసుకున్న తరగతికి ముందు తరగతి పాఠ్యాంశాలపై పరీక్ష రాయాల్సి ఉంటుంది. ఆరవ తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఐదవ తరగతి పాఠ్యాంశాలకు సంబంధించి ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుంది. పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెరిట్, రిజర్వేషన్ ఆధారంగా సీట్లు కేటాయిస్తారు. విద్యార్థులకు ఉచిత నాణ్యమైన విద్యతో పాటు బాలికలకు ఉచిత భోజన, వసతి సౌకర్యం ఉంది..

### దరఖాస్తులు ఇలా....

ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాల కోసం tgms.telangana.gov.in లో దరఖాస్తులు చేసుకోవాలి. జనరల్ విద్యార్థులు 200 రూపాయలు, ఎస్సీ ఎస్టీ బీసీ విద్యార్థులు 125 రూపాయలు ఫీజు చెల్లించాలి. ప్రవేశం పొందే విద్యార్థి పాస్ ఫోటో, బోనఫైడ్, ఆధార్ కార్డు, కులం, నివాసం ధృవీకరణ పత్రాలతో ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవాలి.




### షెడ్యూల్డ్ ప్రక్రియ...

ఆదర్శ పాఠశాలల్లో ప్రతి సంవత్సరం ప్రవేశాల కోసం ప్రతి సంవత్సరం ఆన్లైన్ లో దరఖాస్తు స్వీకరించి ప్రవేశపరీక్ష నిర్వహించి ప్రతిభ ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తారు. ప్రస్తుతం ఆన్లైన్ దరఖాస్తుల ప్రక్రియ ఈ నెల 28 తో ముగియనుంది. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఏప్రిల్ 9 నుండి హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకోవచ్చు. ఆరవ తరగతి లో ప్రవేశాలు పొందే విద్యార్థులకు ఏప్రిల్ 19న ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు, 7, 8, 9, 10 వ తరగతి ప్రవేశాలు పొందే వారికి మధ్యాహ్నం 2 గం నుండి 4 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. మే 13న మెరిట్ జాబితా విడుదల చేసి, మే 31న ఎంపిక జాబితా ప్రదర్శించి, జూన్ 6వ తేదీ వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేపడతారు.

### కల్పించే సదుపాయాలు...

- ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలకు ఎలాంటి అడ్మిషన్ ఫీజులుశీడవు.
- విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో ఇంగ్లీష్ మీడియం విద్యాబోధన.
- ప్రతి పాఠశాలకు ఆధునిక హంగులతో పక్కాభవనాలు.
- 6 నుండి 10వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సౌకర్యం.
- ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందించడం.
- డిజిటల్ సౌకర్యాలతో పాఠ్యాంశాల విద్యాబోధన.
- సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ లాంటి అత్యాధునిక సౌకర్యాలు.

### నాణ్యమైన ఉచిత విద్యాబోధన...

**సార తస్నీమ్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ మందమర్రి**



ఆదర్శ పాఠశాలల్లో అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యాబోధన జరుగుతుండడంతో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా మెరుగైన ఫలితాలు సాధిస్తున్నాము. ఉత్తమ ఫలితాలతో పాఠశాలలో ప్రవేశాల కోసం తీవ్ర పోటీ నెలకొంటుంది. ఆదర్శ పాఠశాలల్లో నాణ్యమైన విద్య బోధనతో పాటు ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ కనబరుస్తుండడంతో ప్రతి సంవత్సరం అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నాము. మెరుగైన ఫలితాలు రావడం తోనే పాఠశాలలో ప్రవేశాల కోసం తీవ్ర పోటీ నెలకొంది.

**ఇరిగేషన్ మీద అసెంబ్లీలో మాట్లాడ దామని ముఖ్యమంత్రి అంటున్నారు.. మేము మీ సవాల్‌ను స్వీకరిస్తున్నాం.. మైక్ కట్ చేయకుండా, కెమెరా తిప్ప కుండా చర్చకు పెట్టు.. ఎన్ని రోజులై నా, ఏ ప్రాజెక్టు మీదైనా చర్చించడానికి మేము సిద్ధంగా ఉన్నాం, ప్రజలే న్యాయ నిర్ణేతలు, ఎవరు ఏం చేశారో అసెంబ్లీ వేదికగా తేల్చుకుందాం అని మాజీ మంత్రి హరీష్ రావు సవాల్ విసిరారు.వరంగల్‌లో నిర్మిస్తున్న సూపర్ స్పెషా లిటీ ఆసు పత్రి నిర్మాణ పనులను మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు, ఇతర బీఆర్ఎస్ నేతలతో కలిసి మంగళవారం పరిశీలించారు.**



## దమ్ముంటే సాగునీటి ప్రాజెక్టులపై

# అసెంబ్లీలో చర్చకు రావాలి

- ●దేవాదుల ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం ఆగమాగం చేస్తుంది
- ●సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలి
- ●ఆసుపత్రి పనులు పూర్తి చేయకపోతే నిరాహారదీక్షకు దిగుతాం
- ●ఆసుపత్రి పనులను కావాలనే నత్తనడకన సాగిస్తున్నారు
- ●ఫ్యూచర్ సిటీ పై ఉన్న ధ్యాస.. ఆసుపత్రి పై లేదు
- ●ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీష్ రావు మండిపాటు

**జనోదయ, వరంగల్ ఎంజీఎం, ఫిబ్రవరి 24:**

ఇరిగేషన్ మీద అసెంబ్లీలో మాట్లాడదామని ముఖ్యమంత్రి అంటున్నారు.. మేము మీ సవాల్‌ను స్వీకరిస్తున్నాం.. మైక్ కట్ చేయకుండా, కెమెరా తిప్పకుండా చర్చకు పెట్టు.. ఎన్ని రోజులైనా, ఏ ప్రాజెక్టు మీదైనా చర్చించడానికి మేము సిద్ధంగా ఉన్నాం, ప్రజలే న్యాయ నిర్ణేతలు, ఎవరు ఏం చేశారో అసెంబ్లీ వేదికగా తేల్చుకుందాం అని మాజీ మంత్రి హరీష్ రావు సవాల్ విసిరారు. వరంగల్‌లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులను మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు, ఇతర బీఆర్ఎస్ నేతలతో కలిసి మంగళవారం పరిశీలించారు. అనంతరం హరీష్ రావు మీడియాతో మాట్లాడుతూ... మా దెబ్బకే సీఎంకు సోయి వచ్చింది మొన్న మేము దేవాదుల ప్రాజెక్టును సందర్శించినప్పుడు, సమ్మక్క బ్యారేజీలోని 10 మోటార్లలో కేవలం 6 మాత్రమే నడుస్తున్నాయని, రోజుకు 2700 క్యూసెక్కులు ఎత్తాల్సిన చోట 1700 క్యూసెక్కులు కూడా ఎత్తడం లేదని ఎత్తిచూపాం అని తెలిపారు. కాంగ్రెస్ నిర్లక్ష్యం వల్ల ప్రాజెక్టు ఏ విధంగా దెబ్బతింటుందో ప్రజల ముందు ఉంచాం. ఆ దెబ్బకు తెల్లారి ముఖ్యమంత్రి హడావిడిగా రివ్యూ చేసి అన్ని మోటార్లు నడపాలని ఆదేశించారు. ఇది బీఆర్ఎస్ విజయమే కాదు, రైతుల విజయం అని అన్నారు.డెడ్ లైన్లు మారుతున్నాయి తప్ప.. పనులు కావడం లేదు అని,మంత్రులు దేవాదుల ప్రాజెక్టు తమ ప్రాధాన్యత అని పదేపదే చెప్తున్నారు, కానీ చేతల్లో మాత్రం అది వారికి చివరి ప్రాధాన్యతగా మారింది అని ఎద్దేవా చేశారు.కేసీఆర్ ప్రభుత్వంలో 7300 కోట్లు ఖర్చు పెట్టి 3 లక్షల 20 వేల ఎకరాలకు సాగునీరు అందించాం అని, కానీ ఇప్పుడు కాంగ్రెస్ మంత్రులు డెడ్ లైన్లు మార్చుకుంటూ కాలయాపన చేస్తున్నారు అని విమర్శించారు.

**పొంతన లేని మంత్రుల మాటలు...**

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మార్చి 2026 నాటికి పూర్తి చేస్తామంటే, ఉత్తమ్ కుమార్ రెడ్డి 2027 మార్చి డెడ్ లైన్ పెట్టారు. ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి ఏమో 2025 డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని మరో కొత్త డెడ్ లైన్ పెట్టారు.. రోజుకో డేట్ మారుతోందే తప్ప ప్రాజెక్టులో అంగుళం పని కూడా ముందుకు సాగడం లేదు అని వ్యాఖ్యానించారు. భూసేకరణకు నిధులు విడుదల చేయడం చేతకాని రేవంత్ రెడ్డి, ఉన్న మోటార్లను నడపలేక రైతుల పంటలు ఎండిపోయేలా చేస్తున్నాడు అని,రెండున్నరేళ్లలో ముఖ్యమంత్రి గోదావరి మీద ఒక్క ప్రాజెక్టు అయినా కట్టారా? అని ప్రశ్నించారు.బీఆర్ఎస్ ప్రభుత్వం గోదావరిపై అనేక బ్యారేజీలు నిర్మించి, 312 కిలో మీటర్ల మేర గోదావరిని నిండుకుండలా సజీవంగా ఉంచింది.9 ఏళ్లలో మేం 48 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తే, మీ రెండున్నరేళ్లలో కనీసం లక్ష ఎకరాలకైనా నీళ్లిచ్చారా? అని నిలదీశారు.మొన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి రివ్యూలో మాట్లాడుతుంటే, ఆయనను ఆపి కడియం శ్రీహరికి దేవాదులపై మంచి నాలెడ్జ్ ఉంది, నెక్స్ట్ రివ్యూలో ఆయన్ను పిలవండి అని సీఎం అనడం ఇరిగేషన్ మంత్రిని అవమానించడమే అని అన్నారు.నీ సొంత క్యాబినెట్ మంత్రికే ఏమీ తెలియదని నువ్వే చెప్తుంటే, ఇక నువ్వు వేరే వాళ్లతో ఎలా పనులు చేయిస్తావు రేవంత్ రెడ్డి? అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

**ఆంధ్ర వాళ్లకు ఎలా సహకరిస్తున్నావో ప్రజలు చూస్తున్నారు...**

దేవాదులను పక్కనపెట్టి ఆంధ్రాకు నీళ్లు ఎలా వదులుతున్నావో, నల్లమల సాగర్‌కు ఎలా సహకరిస్తున్నావో తెలంగాణ ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. ముందు ఆ 10 శాతం పనులు పూర్తి చేసి రైతుల పొలాలకు నీళ్లివ్వు అని అన్నారు.

**కెసిఆర్ ఉంటే హాస్పిటల్ అందుబాటులోకి వచ్చేది...**

బీఆర్ఎస్ హయాంలోనే 24 అంతస్తుల స్లాబులు పూర్తయిన ఈ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని చూస్తుంటే బాధేస్తోంది. 2024 దసరాకే ఇది ప్రారంభం కావాల్సింది. కేసీఆర్ ఉండి ఉంటే ఈపాటికి ప్రజలకు అందుబాటులోకి వచ్చేది. కానీ కాంగ్రెస్ వచ్చాక పనులు అటకెక్కి, రెండు దసరాలు పోయి మూడో దసరా వస్తున్నా కదలడం లేదు. రేవంత్ రెడ్డికి ఫ్యూచర్ సిటీ, రియల్ ఎస్టేట్ వ్యాపారం, కాంట్రాక్టర్ల మీద ఉన్న శ్రద్ధ..కేసీఆర్ కట్టిన ఈ హెల్త్ సిటీ మీద లేదన్నారు. ఫ్యూచర్ సిటీకి పెట్టిన శ్రద్ధలో 10 శాతం పెట్టినా ఈ పనులు ఎప్పుడో పూర్తయ్యేవి అని అన్నారు. రోగుల బంధువుల కోసం కేసీఆర్ గారు ధర్మశాల నిర్మించాలని నిర్ణయిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని సగానికి సగం తగ్గించింది. రోడ్ నెట్వర్క్, ఎలివేషన్ వర్క్స్ అన్నీ తగ్గించేశారు అని, కేసీఆర్ కి మంచి పేరు వస్తుందనే అక్కసుతోనే ఈ నిర్లక్ష్యం అని, ఈ హెల్త్ సిటీకి ఎన్ని నిధులు కావాలో బీఆర్ఎస్ ప్రభుత్వమే సమకూర్చి పెట్టింది అని స్పష్టం చేశారు.కానీ మీరు డిజైన్ల మార్పు పేరుతో నిర్ణయాలు తీసుకోకపోవడం వల్లే ఆసుపత్రి ప్రారంభానికి నోచుకోవడం లేదు అని ఆగ్రహం వ్యక్తం చేశారు.జూన్ 2న ఆసుపత్రిని ప్రారంభిస్తామని చెప్తున్నారు. 2000 పడకల ఈ ఆసుపత్రికి 2000 మంది నర్సులు, 1500 మంది డాక్టర్లు, 1000 మంది పారామెడికల్ సిబ్బంది కావాలి..కానీ ఇంతవరకు రిక్రూట్మెంట్ కు క్యాబినెట్ ఆమోదం తెలిపిందా? నోటిఫికేషన్ ఇచ్చారా? కనీసం సిబ్బంది లేకుండా హాస్పిటల్ ఎలా ప్రారంభిస్తారు? అని ప్రశ్నించారు.పేపర్లలో చూస్తే 'ఓపీ సేవలు' ప్రారంభిస్తాం అని రాశారు. ఇది సూపర్ స్పెషాలిటీ హాస్పిటలా? లేక బస్తీ దవాఖానానా? అని ప్రశ్నించారు. ఓపీ చూడ్డానికి ఈ హాస్పిటల్ ఎందుకు? బీఆర్ఎస్ హయాంలో వరంగల్ గల్లీగల్లీలో బస్తీ దవాఖానాలు పెట్టాం. దీన్ని కూడా మరో బస్తీ దవాఖానా చేయకండి అని అన్నారు.వెంటనే ఎక్విప్మెంట్, సిబ్బంది నియామకం పూర్తి చేసి పూర్తిస్థాయిలో ఆసుపత్రిని ప్రారంభించాలి అని డిమాండ్ చేశారు. లేదంటే బీఆర్ఎస్ పక్షాన ఇక్కడే నిరాహారదీక్షకు దిగుతాం అని హెచ్చరించారు.

**జర్నలిస్టులను విసుక్కుంటున్నారు...**

బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగులతో పాటు జర్నలిస్టులకు ఫ్రీ హెల్త్ స్కీమ్ తెచ్చింది. ఉద్యోగులకు 1% కంట్రిబ్యూషన్‌తో, జర్నలిస్టులకు పూర్తిగా ఉచితంగా సేవలు అందించాలని నిర్ణయించాం. కానీ ఇప్పుడు ఈ ప్రభుత్వం జర్నలిస్టులను చూస్తేనే విసుక్కుంటోంది అని అన్నారు. కేసీఆర్ 100 కోట్లతో జర్నలిస్టుల సంక్షేమ నిధి ఏర్పాటు చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రెండు బడ్జెట్లలో జర్నలిస్టుల కోసం ఒక్క రూపాయి అయినా కేటాయించిందా? అని ప్రశ్నించారు.

**రెండున్నరేళ్లలో ఒక్కరికైనా కొత్త అక్రిడేషన్ కార్డ్ ఇచ్చారా?**

జర్నలిస్టులకు ఎలాంటి నిబంధనలు లేకుండా అక్రిడేషన్లు ఇవ్వాలి అని డిమాండ్ చేశారు.బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసినట్లుగా జర్నలిస్టుల యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్‌కు ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలి. లేదంటే ప్రమాదవశాత్తు జర్నలిస్టులు మరణిస్తే వాళ్ల కుటుంబాలు రోడ్డున పడతాయి అని తెలిపారు.ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్‌ను, జర్నలిస్టుల హెల్త్ స్కీమ్‌ను సమానంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం అని అన్నారు.

**అక్రమ అరెస్టులు కాదు.. ఆసుపత్రిని పూర్తి చేయండి...**

వరంగల్‌లో కార్పొరేటర్లను, మొన్న బాల్క సుమన్‌ను, ఆమన్‌గల్లులో బీఆర్ఎస్ కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేశారు. కక్షలు కట్టడం కాదు, ముందు ఆసుపత్రి కట్టు రేవంత్ రెడ్డి అని అన్నారు.ఆసుపత్రి పూర్తయితే కొన్ని వేల మంది పేదలకు వైద్యం దొరుకుతుంది. కేసీఆర్ మీద పడి ఏడ్వడం మానేసి, 20 లక్షల స్క్వేర్ ఫీట్స్‌తో కడుతున్న ఈ ఆసుపత్రిని వెంటనే పూర్తి చేసి ప్రజలకు అంకితం చేయాలని డిమాండ్ చేస్తున్నాం అని అన్నారు. పర్యటనలో హరీష్ రావు వెంట మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, రవీందర్ రావు, మాజీ ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, వినయ్ భాస్కర్, పెద్ది సుద ర్శన్ రెడ్డి, అరూరి రమేష్, నన్నపునేని నరేందర్, శంకర్ నాయక్, నాగుర్ల వెంకన్న, మర్రి యాదవ రెడ్డి, డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# విప్లవ పోరాటానికి ముగింపు

**దేవ్‌జీ సహా నలుగురు అగ్రనేతల లొంగుబాటు**

**పార్టీలో తెలంగాణకు చెందినవారు ఇంకా 11 మంది**

**వారు కూడా జనజీవన స్రవంతిలో కలవాలి: డీజీపీ**

**డీజీపీ సమక్షంలో లొంగిపోయిన తిప్పిరి తిరుపతి, మల్లా రాజిరెడ్డి, బడే చొక్కారావు, నూనె నర్సింహారెడ్డి**

**అనారోగ్యంతోనే రహస్య జీవితం వదిలాం.. ప్రజా సమస్యలపై ఇకపైనా పోరాటాలు చేస్తాం: దేవ్‌జీ**

**నేపాల్‌లో గణపతి..**

**అదుపులోకి తీసుకున్న పోలీసులు?**



**హైదరాబాద్, ఫిబ్రవరి 24 :** తెలంగాణలో రూపుదిద్దుకున్న మావోయిస్టు విప్లవ పోరాటం ఇక్కడే ముగుస్తోందని రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న పునరావాస చర్యలను గమనించి మావోయిస్టులు లొంగిపోతున్నారని తెలిపారు. మంగళవారం మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అప్రకటిత కార్యదర్శి తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ సహా నలుగురు అగ్రనేతలు పోలీసుల ఎదుట లొంగిపోయారు. హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో డీజీపీ సమక్షంలో దేవ్‌జీతోపాటు మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు నూనె నర్సింహారెడ్డి అలియాస్ గంగన్న లొంగిపోయారు. ఈ సందర్భంగా శివధర్‌రెడ్డి మాట్లాడుతూ.. నలుగురు అగ్రనేతలు లొంగిపోవడం ద్వారా మావోయిస్టు పార్టీ అత్యున్నత సంస్థాగత నిర్మాణం పతనమైందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభ్యర్థన మేరకు లొంగిపోతున్న మావోయిస్టుల పునరావాసానికి కట్టుబడి ఉంటామని, వారి ప్రాణాలకు తమ ప్రాణాలు అడ్డువేసి కాపాడతామని ప్రకటించారు. గతేడాది నుంచి నేటి వరకు నలుగురు కేంద్ర కమిటీ సభ్యులు, 16 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు, 26 మంది జిల్లా కమిటీల సభ్యులు, 85 మంది ఏరియా కమిటీ సభ్యులతోపాటు 460 మంది మావోయిస్టు పార్టీ కార్యకర్తలు కలిపి మొత్తం 591 మంది లొంగిపోయారని వెల్లడించారు. లొంగుబాటే కాకుండా తెలంగాణ ఎస్ఐబీ తీసుకున్న చర్యల వల్ల వీరు ఆయుధాలు కూడా అప్పగించారని, మొత్తం 142 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మావోయిస్టు పార్టీ సంస్థాగత నిర్మాణం కుప్పకూలే దిశగా సాగుతుందన్న విషయాన్ని ఈ పరిణామాలు స్పష్టం చేస్తు న్నాయని పేర్కొన్నారు. మావోయిస్టులకు మద్దతిచ్చే వర్గాలు క్షీణించడం, క్యాడర్ల కదలికలపై పరిమితులు పెరగడం, నిరంతర కూంబింగ్ చర్యలు, సిద్ధాంతపరమైన అసంతృప్తి నేపథ్యంలో.. మిగిలిన వారిలోనూ తీవ్రమైన అంతర్మథనం జరుగుతోందని డీజీపీ శివధర్‌రెడ్డి అన్నారు. ఇంకా కేంద్ర కమిటీలో ముగ్గురు సభ్యులు ముప్పాళ్ల లక్ష్మణరావు, మిసిర్ బెస్రా, నరహరి ఉన్నారని, వీరిలో లక్ష్మణరావు అడవుల్లో లేరని, ఆయన వృద్ధాప్య సమస్యలతో ఎక్కడో చికిత్స పొందుతున్నట్లుగా సమాచారం ఉందని తెలిపారు.
లక్ష్మణరావు, ఆయన భార్య జోడేబాయి కూడా ముందుకొచ్చి లొంగిపోతే వారికి మెరుగైన వైద్య చికిత్స అందిస్తామని హామీ ఇచ్చారు. మావోయిస్టు పార్టీలో తెలంగాణకు చెందినవారు ఇంకా 11 మంది వివిధ క్యాడర్లలో పలు రాష్ట్రాల్లో పనిచేస్తున్నారని, వారంతా కూడా త్వరగా వచ్చి జనజీవన స్రవంతిలో కలవాలని పిలుపు నిచ్చారు. లొంగి పోయిన నలుగురు మావోయిస్టు నేతలపై ఉన్న రివార్డు మొత్తాన్ని డీజీపీ శివధర్‌రెడ్డి వారికి అందజేశారు. తిరుపతి, రాజిరెడ్డికి ఒక్కొక్కరిపై రూ.25 లక్షల చొప్పున ఉన్న రివార్డును, చొక్కారావు, నర్సింహారెడ్డిలపై రూ.20 లక్షల చొప్పున ఉన్న రివార్డును కలిపి మొత్తం రూ.90 లక్షలను వారికి అందజేశారు. వీరికి పునరావాస పథకం ద్వారా అందే ఇతరత్రా అన్ని ప్రయోజనాలనూ త్వరలో అందిస్తామని తెలిపారు.

**రాజకీయ జీవితం కొనసాగిస్తా: దేవ్‌జీ**

అనారోగ్య సమస్యలతోనే తాము రహస్య జీవితాన్ని వదిలి వచ్చామని, వ్యక్తిగత జీవితం కోసం కాదని మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అప్రకటిత కార్యదర్శి తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ అన్నారు. ప్రజా సమస్యలపై తమ పోరాటాలు కొనసాగుతూనే ఉంటాయన్నారు. తాను రాజకీయ జీవితాన్ని కొనసాగిస్తానని, నమ్మిన సిద్ధాంతాన్ని కాపాడుకుంటానని స్పష్టం చేశారు. చెప్పాల్సిన విషయాలు చాలా ఉన్నాయని, అన్నీ త్వరలో వెల్లడిస్తామని పేర్కొన్నారు.

**మావోయిజానికి ముగింపు లేదు: రాజిరెడ్డి**

మావోయిజానికి ఎప్పుడూ ముగింపు ఉండదని, పోరాట పద్ధతుల తీరు మాత్రమే మారుతుందని మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్ అన్నారు. ప్రజా సమస్యలపై ప్రజలతో కలిసి పోరాటాలు చేస్తున్నవారిని సంఘటితం చేసుకుంటూ తాను ప్రజాక్షేత్రంలోనే ఉంటానన్నారు. ప్రజాస్వామిక పద్ధతుల్లో పనిచేస్తామని, అయితే పార్లమెంటరీ వ్యవస్థ వైపు తాను వెళ్లనని స్పష్టం చేశారు. తమ ఆలోచనల విస్తృత రూపాన్ని త్వరలో ప్రజల ముందు ఉంచుతానని తెలిపారు.

**నేపాల్‌లో గణపతి.. తెలంగాణ పోలీసుల అదుపులోకి!**

మావోయిస్టు పార్టీ ప్రస్తుత కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ కార్యదర్శి ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతితోపాటు ఆయన భార్య జోడే రత్నాబాయి అలియాస్ సుజాతను నేపాల్‌లో తెలంగాణ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఒకటి రెండు రోజుల్లో వీరిద్దరిని సైతం మీడియా ముందు ప్రవేశపెట్టనున్నట్లు సమాచారం. అనారోగ్యంతో బాధపడుతూ నడవలేని స్థితిలో ఉన్న గణపతికి అడవుల్లో షెల్టర్ ఇవ్వడం ప్రయాసగా మారడంతో ఆయనను పార్టీ నాయకత్వం రెండేళ్ల క్రితం నేపాల్‌కు తరలించినట్లు తెలుస్తోంది.

ప్రజల కోసం అడవిబాట పట్టిన తన కొడుకు ఇంటికి క్షేమంగా రావాలని వనదేవతలు సమ్మక్క- సారలమ్మలను మొక్కుకున్నానని మావోయిస్టు నేత బడే చొక్కారావు తల్లి బడే బతుకమ్మ అన్నారు. చొక్కారావు పోలీసులకు లొంగిపోయారనే సమాచారం తెలియగానే సంతోషించానని 'ఆంధ్రజ్యోతి'తో చెప్పారు. 30 ఏళ్ల క్రితం దూరమైన కన్న కొడుకును చూడబోతున్నానని బతుకమ్మ ఆనంద భాష్పాలు రాల్చారు. పలువురు గ్రామస్తులు బతుకమ్మ ఇంటి వద్దకు వచ్చి సంతోషం వ్యక్తం చేశారు. కాగా, దేవ్‌జీ అలియాస్ తిప్పిరి తిరుపతి లొంగుబాటుతో ఆయన కుటుంబసభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. "మా నిరీక్షణ నెరవేరింది.. జనజీవన స్రవంతి నిన్ను స్వాగతిస్తోంది పెద నాన్నా" అంటూ తిరుపతి తమ్ముడి కూతురు సుమ 'ఎక్స్'లో పోస్టు చేశారు.
మావోయిస్టు పార్టీలో తెలంగాణకు చెందినవారు ఇంకా 11 మంది ఉన్నట్లు డీజీపీ శివధర్‌రెడ్డి చెప్పినవారిలో కేంద్ర కమిటీ సభ్యుడైన ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి తీవ్రమైన అనారోగ్యంతో నేపాల్‌లో ఉన్నట్లు భావిస్తున్నారు. మరో కేంద్ర కమిటీ సభ్యుడైన పసునూరి నరహరి అలియాస్ సంతోష్ ఈస్ట్ రీజినల్ బ్యూరోలో పనిచేస్తూ ఝార్ఖండ్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు పోలీసు వర్గాలు పేర్కొం టున్నాయి. ఒడిసా రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా పనిచేస్తున్న ముప్పిడి సాంబయ్య అలియాస్ సుదర్శన్, దండకారణ్య స్పెషల్ జోనల్ కమి టీలో కమ్యూనికేషన్ వింగ్ ఇన్‌చార్జిగా ఉన్న వార్త శేఖర్ అలియాస్ మంగ్తూ, కేంద్ర కమిటీ సభ్యురాలైన ముప్పాళ్ల లక్ష్మణరావు భార్య జోడే బాయి అలియాస్ సుజాత మాడ్ డివిజన్ ఇన్ చార్జిగా ఉన్నట్లు పోలీసులు పేర్కొంటున్నప్పటికీ ఆమె గణపతితోనే ఉన్నట్లు తెలుస్తోంది. మావోయిస్టు పార్టీ విద్యాకమిటీలో పనిచేస్తున్న నక్కా సుశీల, సాంకేతిక విభాగంలో పనిచేస్తున్న జాడి పుష్ప, ఏరియా కమిటీ సభ్యురాలైన రంగ బోయిన భాగ్య అలియాస్ రూపీ, కాశపోగు భవాని, కుంజం ఇడ్మాల్, అనిల్‌కుమార్‌లు ఇం కా అడవుల్లో రహస్య జీవితం గడుపుతున్నారని పోలీసులు తెలిపారు.

## 25మంది ఎమ్మెల్యేల

# రహస్య మంతనాలు

**బీఆర్ఎస్ మునిగిపోయిన నావ**

**కరీంనగర్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు దిమ్మదిరిగే షాక్**

**కేంద్రమంత్రి బండి సంజయ్**

**హైదరాబాద్, ఫిబ్రవరి 24 :** కర్ణాటకలో మాదిరిగా తెలంగాణలో కూడా అధికార కాంగ్రెస్ పార్టీలో ముసలం ప్రారంభమైందని కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యానించారు. 25 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఫోన్‌లో మాట్లాడుకున్నారని చెప్పారు. మంత్రి పదవుల కోసం రెండు జిల్లాల ఎమ్మెల్యేలు రహస్య భేటీలు నిర్వహించారన్నారు. కరీంనగర్ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని మునిసిపాలిటీల కౌన్సిలర్లు, కరీంనగర్ మేయర్, డిప్యూటీ మేయర్లను మంగళవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సన్మానించారు. తర్వాత పాతబస్తీలోని భాగ్యలక్ష్మి అమ్మవారి గుడిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సంజయ్ మాట్లాడుతూ.. "8 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సోమవారం ఓ చోట రహస్యంగా భేటీ అయ్యారు. మంత్రుల కమీషన్లు, కలెక్షన్లపై చర్చించుకున్నారు.. వారి అవినీతి వల్ల పార్టీ భ్రష్టు పట్టిపోతోంది. మంత్రులుగా మాకు అవకాశం ఇవ్వండి అంటూ రాహుల్‌గాంధీకి లేఖరాశారు. ఇది వాస్తవం' అని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, తమకు నిధులివ్వడం లేదని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నారాజ్‌గా ఉన్నారన్నారు. కాంగ్రెస్ నేతలు తమ ప్రభుత్వాన్ని కూల్చే అవకాశం ప్రతిపక్షాలకు ఇవ్వరని, వారే ఆ పని చేస్తారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పార్టీ 'మునిగిపోయిన' నావ అని పేర్కొన్న సంజయ్.. ఆ పార్టీని రక్షించడం ఎవరి తరమూ కాదని తేల్చిచెప్పారు. మునిసిపల్ ఎన్నికల్లో 7 కార్పోరేషన్లలో ఆ పార్టీ అడ్రస్ గల్లంతు కాగా, అంతకుముందు ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు అభ్యర్థులే దొరకలేదన్నారు. 'కరీంనగర్ నగర పాలక సంస్థను బీజేపీ గెలుచుకోవడం మామూలు విషయం కాదు. ఇదొక కల. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం కుమ్మక్కై మేయర్ పదవి బీజేపీకి దక్కకుండా కుట్ర చేశాయి. కానీ, ముగ్గురు బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఆ పార్టీ నాయకత్వంపై తిరుగుబాటు చేసి స్వచ్ఛందంగా బయటికొచ్చి బీజేపీకి మద్దతునిచ్చారు.' అని సంజయ్ అన్నారు. ' సంజయ్ అనే నేను పార్టీలో లేకుంటే కుక్కలు కూడా పట్టించుకోవు. మా పార్టీలో ప్రతి కార్యకర్తకూ బీజేపీ కార్యాలయమే ఓ దేవాలయం,



పార్టీకంటే మేమే గొప్ప అనుకున్న వారంతా తెర మరుగయ్యారు' అని సంజయ్ పేర్కొన్నారు.

**స్వర్ణ దేవాలయంలా భాగ్యలక్ష్మి టెంపుల్**

రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా తమ బూట్లు నాకాల్సిందేనని మజ్లిస్ నేతలు చెబుతున్నారంటే.. బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలకు సిగ్గుండాలని సంజయ్ మండి పడ్డారు. హైదరాబాద్‌లో హిందూ సమాజా నికి ఏ ఆపద వచ్చినా ఆదుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే భాగ్యలక్ష్మి ఆలయాన్ని గోల్డెన్ టెంపుల్‌గా తీర్చి దిద్దుతామని సంజయ్ చెప్పారు. భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఆయన మాట్లాడారు. "అమ్మవారి శక్తి తెలిసే ఇక్కడి నుంచే చేపట్టిన ప్రజా సంగ్రామ యాత్ర 1640 రోజులు 1640 కి.మీ దూరం సాగింది" అని చెప్పారు.

కాంగ్రెస్ కార్పొరేటర్

## పోతుల శ్రీమన్ అరెస్టు

**చర్లపల్లి జైలుకు తరలింపు**



**సుబేదారి, ఫిబ్రవరి 24:** హనుమకొండ కొత్తూరుకు చెందిన రౌడీషీటర్, కాంగ్రెస్ పార్టీ 5వ డివిజన్ కార్పొరేటర్ పోతుల శ్రీమన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆర్థిక లావాదేవీల విషయమై ఒకరిపై హత్యాయత్నం కేసులో శ్రీమన్‌ను ఇంటివద్దే మంగళవారం రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సరూర్‌నగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గత ఏడాది మే 22వ తేదీన నసరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గౌతమ్‌నగర్‌కు చెందిన చీదార శ్రీనివాస్‌ను ఇంట్లోకి ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు చొరబడ్డారు. మాస్కులు ధరించిన ఇద్దరూ శ్రీనివాస్‌పై దాడి చేయగా అతడు తీవ్రంగా గాయపడ్డాడు. అనతరం బాధితుడి ఫిర్యాదు మేరకు సరూర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి సీసీ కెమెరాల ద్వారా నిందితులను గుర్తించారు. దాడికి పాల్పడినవారిలో హనుమకొండకు చెందిన సయ్యద్ యా కుబ్ అలియాస్ షకీల్ ఉన్నట్టు గుర్తించిన పోలీసులు అతడిని విచారించారు. శ్రీనివాస్‌పై దాడి చేయించింది కార్పొరేటర్ శ్రీమాన్ అని అతడు తెలిపాడు. బాధితుడు శ్రీనివాస్–శ్రీమన్ మధ్య రూ.35 లక్షల ఆర్థిక లావాదేవీల కారణంగా గొడవలు జరుగుతున్నట్లు పోలీసులు గుర్తించారు. శ్రీమన్‌పై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసిన పోలీసులు సమగ్ర దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో గత ఆరు నెలలుగా కార్పొరేటర్ శ్రీమన్ పోలీసులకు దొరకకుడా తప్పించుకుని తిరుగుతున్నాడు. అయితే.. మంగళవారం హనుమకొండ కొత్తూరులో శ్రీమన్ ఉన్న విషయం తెలుసుకున్న సరూర్‌నగర్ పోలీసులు ఇంటికి అతడిని వచ్చి అరెస్టు చేశారు. అనంతరం అతడిని చర్లపల్లి జైలుకు తరలించినట్టు సమాచారం. శ్రీమన్‌పై హనుమకొండ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ ఉన్నట్లు హనుమకొండ పోలీసులు తెలిపారు.